
సాక్షి
పల్నాడు
మంగళవారం । 3 । జనవరి । 2023



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.6407 టీఎంసీలు. ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1,016 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 1450 క్యూసెక్కులు నిల్వ ఉంది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

5 వరకు 144 సెక్షన్

మాచర్ల: శాంతిభద్రతల దృష్ట్యా ఈనెల 5వ తేదీ వరకు 144 సెక్షన్‌ను పొడిగించినట్లు అర్బన్ సీఐ టి.బాలకృష్ణ సోమవారం తెలిపారు. గత నెల 17 నుంచి రెవెన్యూశాఖాధికారుల ఆదేశాల మేరకు 144 సెక్షన్‌ను విధించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో దీనిని గమనించి ప్రతిఒక్కరూ గుంపులు గుంపులుగా చేరకుండా పోలీసు శాఖకు సహకరించాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఊరేగింపులు, సభలు జరపకూడదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు జెడ్పీలో స్థాయీ సంఘాల భేటీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం జరగనున్నాయి. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకు 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జెడ్పీలోని ఆమె చాంబర్లో జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనుల అంశాలు ఉన్నాయి. అలాగే వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘ అధ్యక్షుడు, జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘ అధ్యక్షురాలు, తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘ అధ్యక్షురాలు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. జెడ్పీ సీఈఓ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డితోపాటు జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు సమావేశాల్లో పాల్గొననున్నారు.

నృసింహుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు



మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని లక్ష్మీ నృసింహస్వామి ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత న్యాయమూర్తులకు దేవస్థాన ఈఓ రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు.

వేజండ్ల ఆర్‌బీకేను సందర్శించిన తెలంగాణ అధికారులు



వేజండ్ల(చేబ్రోలు): స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను తెలంగాణ కమిషనరేట్ డీడీఏ వేణుగోపాల్, జేడీఏ విద్యా గౌరీ, ఏడీఏ అనిత, ఏఓ రాజేష్‌తో కూడిన బృందం అడిగి తెలుసుకున్నారు. రైతులకు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చి విక్రయించే వరకు అన్ని రకాల సేవలు అందజేస్తున్న విధానాన్ని పరిశీలించారు. పంట నమోదు చేసే విధానం, క్రాప్ ఇన్సూరెన్స్ తదితర అంశాల గురించి రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ తిరుమలాదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శ్రీనివాస్ నాయక్, ఏఈఓ కె.సునీత పాల్గొన్నారు.

28,857 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,857 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,499 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,600 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.20,000 నుంచి రూ.26,300 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,000 నుంచి రూ.21,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,994 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

భక్తజన మంగళాద్రి

- వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు
- వైకుంఠ ద్వారం నుంచి దేవదేవేరుల దివ్యదర్శనం
- సామాన్య క్యూలైన్‌లోనే ఎమ్మెల్యే ఆర్కే
- రెండు గంటలు వేచి ఉండి మరీ దర్శనం



లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



బంగారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. ముక్కోటి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి జగన్మోహిని అలంకారంలో కటాక్షించిన స్వామికి రాత్రి ఒంటి గంట నుంచి 3 గంటల వరకు తిరుమంజనోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం నాలుగు గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన శ్రీవారు బంగారు గరుడ వాహనం అధిరోహించి ఉత్తర ద్వారం వద్దకు చేరుకున్నారు. అప్పటికే భారీగా వేచి ఉన్న భక్తులకు సాక్షాత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణతో మార్మోగింది. స్వామి దర్శనం అనంతరం భక్తులు బంగారు దక్షిణావృత్త శంఖుతీర్థం స్వీకరించారు. ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సామాన్యభక్తులతోపాటే ఎమ్మెల్యే కూడా..

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సామాన్య భక్తులతో కలిసి క్యూలైన్‌లో రెండు గంటల పాటు వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి ఉన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జిల్లా జడ్జి హరనాథ్ శర్మ, మంగళగిరి జడ్జి డి.శేషయ్య, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, శివస్వామి తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

అలరించిన ప్రదర్శనలు: ఆలయం ఎదుట రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళావేదికలో ఆదివారం రాత్రి నుంచే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి.

పటిష్ట బందోబస్తు

ముక్కోటి నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నార్త్ జోన్ డీఎస్పీ జె.రాంబాబు ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ సీఐలు అంకమరావు, ఎస్‌ఐలు మహేంద్ర, నారాయణతోపాటు పలువురు ప్రత్యేక సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జాప్యం బాబు నైజం

జనం కోసం 'జపం'

- గంటల కొద్దీ ఆలస్యానికి ముందే ప్రణాళికలు
- గుంటూరులో పంపిణీకి మూడు గంటలు ఆలస్యం
- నాటి పాదయాత్ర మొదలు రోడ్ షో వరకూ అదే పంథా
- హుద్‌హుద్ తుఫాన్ సమయంలోనూ ప్రచారపిచ్చి పీక్‌కు
- కిలోమీటరుకు గంటలంటూ పచ్చమీడియా పైత్యపురాతలు
- ప్రజల బ్రహ్మారథమంటూ సోషల్ భజన బృందాలు
- జనసమీకరణకు, ప్రచారానికి ప్రత్యేక కమిటీలు
- అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలోనైనా ఇదే రివాజు



ఎన్టీఆర్ జిల్లా నందిగామలో జరిగిన చంద్రబాబు రోడ్ షో(ఫైల్)

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రచారపిచ్చికి పేదప్రజలు నిలువునా ప్రాణాలు కోల్పోతున్నారు. మొన్న కందుకూరు, నిన్న గుంటూరు. కార్యక్రమం ఏదైనా సరే తను పాల్గొన్న వాటికి భారీఎత్తున ప్రజలు వచ్చారని చూపుకునేందుకు, ప్రచారం చేసుకునేందుకు గంటల కొద్దీ ఆలస్యం చేయడం బాబుకు షరా మామూలే. ఆదివారం గుంటూరులో చీరలు, సరుకులు పంచిపెడతామని చెప్పిన సమయానికి ప్రారంభించకపోగా మూడు గంటలు ఆలస్యంగా చంద్రబాబు వేదిక వద్దకు చేరుకున్నారు. గంటాపది నిమిషాలు ఉపన్యాసం చెప్పి నామమాత్రంగా పంపిణీ చేసి వెళ్లిపోయారు. ఆ తరువాత తొక్కిసలాట జరిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, పలువురు గాయాలకు గురై ఆసుపత్రుల పాలైన సంగతి తెలిసిందే. చీరలు, వస్తువులు పంపిణీ చేస్తామని పేదలకు ఆశపెట్టి మధ్యాహ్నం 12 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి సమీకరించారు. అసలే జనవరి ఒకటో తేదీ. పండుగ వాతావరణం. ఆ సమయంలో కుటుంబ సభ్యులతో గడపాలని ఎవరైనా కోరుకుంటారు. ఉచితంగా వస్తాయన్న ఉద్దేశంతో అన్ని వయసుల పేద మహిళలు చేరుకున్నారు. అక్కడకు వచ్చిన వారికి కనీసం మంచినీటి వసతి, ఇతరత్రా సరిపడా వసతులు, ఏర్పాట్లు చేసిన దాఖలాలే లేవని బాధితవర్గాలు ముక్తకంఠంతో వాపోయాయి. చంద్రబాబు వచ్చి ప్రసంగించి తిరిగి వెళ్లిపోయే వరకు వందలు, వేలాది మందిని నాలుగు గంటలకుపైగా కూర్చోపెట్టారు. బాబు వెనుతిరిగేప్పటికీ దాదాపు చీకటి పడుతోంది. గంటల కొద్దీ వేచి ఉన్న వారు ఇళ్లకు త్వరగా తిరిగి వెళ్లాలనే ఆతృతతో ముందుకు చొచ్చుకు రావడంతో తొక్కిసలాట జరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. ఏదైనా భారీ ఎత్తున పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నప్పుడు సమయం చూసుకోవడం నిర్వాహకుల కనీస బాధ్యత. తనది నలభయ్యేళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు అక్కడి పరిస్థితులను కనీసమైనా అంచనా వేసుకోలేకపోయారా అనేది మొదటి ప్రశ్న. ఇదే ప్రశ్న ఇప్పుడు అన్నివైపుల నుంచి వస్తోంది.

జనం కోసం జాప్యం చేయడం అలవాటే..

ఆలస్యం అమృతం విషం... అంటారు పెద్దలు. ఆలస్యమయ్యే కొద్దీ అనర్థాలు అధికమనేది దీనర్థం. కానీ టీడీపీ అధినేత చంద్రబాబుకు సంబంధించినంత వరకు ఇది పూర్తిగా భిన్నం. తను పాల్గొనే కార్యక్రమం ఎంత ఆలస్యమైతే అంత మంచిదనేది ఆయన నిశ్చితాభిప్రాయమనేది పరిశీలకుల మాట. అది పాదయాత్ర అయినా, రోడ్ షో, బహిరంగ సభ చివరకు పరామర్శ అయినా సరే లేట్ అంటే బాబుకు భలే మోజని ఉదహరిస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రజలు పాల్గొనే బహిరంగ సభలను ఆలస్యంగా నిర్వహించడానికి స్లీపర్‌సెల్స్‌గా ప్రత్యేక బృందాలూ ఏర్పాటై అంతర్లీనంగా పనిచేస్తుంటాయనేది పబ్లిక్‌టాక్. మరోవైపు లేట్ అయిపోతోంది, త్వరపడండనే సన్నాయినొక్కుల 'హెచ్చరిక'లు మైకుల్లో ధ్వనిస్తుంటాయి. ఇవన్నీ పక్కా ప్లానింగ్‌తోనే అనేది పార్టీలోని ఆయా జిల్లాల ముఖ్యులకు తెలియని రహస్యాలేమీ కావు. సమయం, సందర్భం ఏదని కూడా చూడకుండా, వాస్తవాలను వెల్లడించకుండా ప్రజలు అడగడుగునా బ్రహ్మారథం పట్టారనే పచ్చ మీడియా పైత్యపురాతలు పలుసార్లు వెగటు పుట్టిస్తుంటాయని టీడీపీ నాయకులే వాపోయిన సందర్భాలు లేకపోలేదు. ఇక టీడీపీ సోషల్ మీడియా బృందాలు హైప్ సృష్టించడం పరాకాష్టే. ఇటీవలి కాలంలో జరిగిన కొన్ని కార్యక్రమాలను పరిశీలిస్తే..

- బుధవారం కందుకూరు కార్యక్రమం 5.15 గంటల నుంచి రాత్రి ఏడు గంటల్లోగా ముగియాలి. కానీ సింగరాయకొండ సెంటర్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలోని కందుకూరుకు చేరుకోవడానికి మూడు గంటల సమయం పట్టిందని పచ్చ మీడియా విశ్లేషించింది. సభ ముగించాల్సిన సమయానికన్నా మరో అరగంట ఆలస్యంగా ఇరుకు ప్రాంతంలోకి చేరుకోవడం, 8 మంది మృతికి కారణం కావడం చంద్రబాబుకే చెల్లింది.
- చంద్రబాబు కొవ్వూరులో డిసెంబరు ఒకటో తేదీ రాత్రి 8 గంటలకు జరగాల్సిన సభను 10.30 గంటలకు ప్రారంభించి 50 నిమిషాలపాటు ప్రసంగించారు. రెండో తేదీ నిడదవోలులో మధ్యాహ్నం మూడు గంటలకు బదులు సాయంత్రం 6.30 గంటలకు మొదలెట్టి 40 నిమిషాలు మాట్లాడారు. తాడేపల్లిగూడెంకు మూడన్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు చేరుకున్నారు.
- వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన పేరిట అక్టోబరు 19న పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాల నియోజకవర్గాలకు చంద్రబాబు వెళ్లారు. గురజాల నుంచి సాయంత్రం 6.15 గంటలకు ఉండవల్లికి బయలుదేరతారని షెడ్యూల్ ప్రకటించగా రాత్రి 12.15 గంటలకు ఉపన్యాసం ముగించారు. రాత్రి 7-11 గంటల మధ్యలో రెండుచోట్ల పొలాలను సందర్శించడం చంద్రబాబుకే సాధ్యమైంది.
- నవంబరు 4వ తేదీ ఎన్టీఆర్ జిల్లాలో బాదుడే బాదుడు కార్యక్రమం పేరిట నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో చంద్రబాబు రోడ్‌షో నిర్వహించారు. ఏడు గంటలకు జరగాల్సిన మీటింగ్ రాత్రి 11 గంటలకు జరగడం గమనార్హం.
- గోదావరి పుష్కరాలలో ప్రచారపిచ్చి పీక్‌కు చేరి 29 మందిని పొట్టనపెట్టుకున్న సంగతి తెలిసిందే. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో విశాఖలో తిష్టేసిన చంద్రబాబు ఫొటోలకు ఫోజులిచ్చే క్రమంలో తెల్లవారుజామున 3, 4 గంటలప్పుడు కూడా తెగ తిరిగేశారు. బాబు ప్రచారపిచ్చితో తమను పనులు చేసుకోనివ్వకుండా ఆటంకం కలిగిస్తూ ప్రజలకు ఇబ్బందులు పెంచేస్తున్నారని అధికారులు, సిబ్బంది వాపోయిన సందర్భాలు అనేకం. అంతేనా తుపాన్లను సైతం అడ్డుకుంటానని వల్లెవేయడం బాబు ప్రచారానికి పరాకాష్టగా పరిశీలకులు గుర్తుచేస్తుంటారు.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి

కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: స్పందనలో వచ్చిన ప్రతి అర్జీనీ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. మొత్తం 108 మంది వినతిపత్రాలు అందించారు. కలెక్టర్ అర్జీలను సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వసంతబాబు కలెక్టర్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఆ వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

మాచర్ల గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ఓ బాలికను బయటకు తీసుకెళ్లి వారం తర్వాత తీసుకొచ్చిన వార్డెన్ శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, చీటింగ్ కేసులు నమోదు చేయాలని, జైలులో ఉన్న అతడు బెయిలుపై బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ నీటిమట్టం సోమవారం 579.80 అడుగుల వద్ద ఉంది. ఇది 282.4368 టీఎంసీలకు సమానం. కుడి కాలువకు 8,680, ఎడమ కాలువకు 8,718, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు. మొత్తం ఔట్ ఫ్లోగా 19,598 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 19,598 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 856.80 అడుగుల వద్ద ఉంది.

భలే మంచి తరుణం

పేదల ఇంటి నిర్మాణానికి అదనపు దన్ను

- డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీతో రూ.35 వేల రుణం
- అది చాలకుంటే మరో విడతలో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ
- ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేని అప్పు
- పల్నాడు జిల్లాలో ఇప్పటికే 23,941 మందికి రూ.83.79 కోట్లు మంజూరు



నరసరావుపేటలోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, నరసరావుపేట: పేదల సొంతింటి కలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేస్తోంది. ఇప్పటికే పల్నాడు జిల్లాలో తొలివిడతలో 42,899 మందికి ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీరందరూ ఇళ్లు కట్టుకునేలా ప్రతి దశలో సర్కారు అండగా నిలుస్తోంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక, ఐరన్‌ను మార్కెట్ ధర కన్నా తక్కువకే సరఫరా చేస్తోంది. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు సాయం చేస్తోంది. ఈ నగదు సరిపోకుంటే డీఆర్డీఏ, మెప్మా సహకారంతో పూచీకత్తు లేకుండా డ్వాక్రా మహిళలకు అదనంగా రుణం అందిస్తోంది.

23,941 మందికి పావలా వడ్డీతో రుణం

డ్వాక్రా సంఘాల ద్వారా రూ.35 వేల రుణాన్ని పావలా వడ్డీకే అందజేస్తోంది. వీటిని స్వల్ప వాయిదాలలో చెల్లించే వెసులుబాటు కల్పించింది. పల్నాడు జిల్లాలో ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతంలోని 9,557 మందికి రూ.33.45 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 14,384 మందికి రూ.50.34 కోట్ల రుణం బ్యాంకర్లు అందజేశారు. మొత్తం జిల్లాలో 23,941 మందికి రూ.83.79 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయించింది.

రూ.లక్ష వరకు వడ్డీ లేని రుణం..

బ్యాంక్ లింకేజ్ ద్వారా ఇచ్చిన రూ.35 వేల రుణం ఇంటి నిర్మాణానికి సరిపోని పక్షంలో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు 'ఉన్నతి' పథకం ద్వారా అదనంగా రెండో విడతలో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం మంజూరు చేయిస్తోంది. ఈ రుణానికి వడ్డీ కట్టాల్సిన పని ఉండదు. అవసరమైతే ఈ రుణానికి దరఖాస్తు చేసుకోవచ్చు.


రూ.లక్ష వరకు వడ్డీలేని రుణం



జగనన్న కాలనీలలో ఇళ్లను నిర్మించుకునే లబ్ధిదారులకు డీఆర్‌డీఏ ద్వారా అవసరమైన రుణాలు మంజూరు చేస్తున్నాం. తొలి విడతలో పావలా వడ్డీతో రూ.35 వేలు అందజేస్తున్నాం. అది చాలకపోతే ఉన్నతి పథకం వర్తించే వారికి వడ్డీ లేకుండా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఎలాంటి పూచికత్తు లేకుండా రుణం మంజూరు చేస్తున్నాం. గృహప్రవేశాలు జరిగే వరకు ప్రతి దశలో మహిళలకు అండగా ఉంటాం.

– బాలునాయక్, డీఆర్డీఏ పీడీ, పల్నాడు జిల్లా

రూ.35 వేల రుణంతో ఇంటి నిర్మాణం



జగనన్న మాకు ఇంటి పట్టా, ఇళ్ల నిర్మాణానికి రూ.1.8 లక్షల ఆర్థిక సహాయం చేశారు. మరి కొంత నగదు అవసరం కావడంతో డ్వాక్రా సంఘం ద్వారా అదనంగా రూ.35 వేల రుణం పొందాను. పావలా వడ్డీతో సులభ వాయిదాలలో చెల్లిస్తున్నాను. సొంతి ఇంటి నిర్మాణంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ సహకారం అందిస్తోంది.

– అనిత, పాటిబండ్ల, పెదకూరపాడు మండలం

ఐదు నిమిషాల్లో వస్తామని చెప్పి మృత్యుఒడికి

- ఇద్దరు స్నేహితుల దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- ద్విచక్రవాహనాలు అదుపు తప్పడం వల్లే ప్రమాదం




మృతులు మేరుగ గోపి, గుమ్మలంపాటి ప్రభుదేవా

తాడేపల్లిరూరల్ : ఆ ముగ్గురూ స్నేహితులు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి వరకు ఉత్సాహంగా పార్టీ చేసుకున్నారు. ఇంట్లో వాళ్లు ఫోన్ చేస్తే ఐదు నిమిషాల్లో వచ్చేస్తామని చెప్పి ఇళ్లకు ఆనందంగా బయలుదేరారు. వీరి స్నేహాన్ని చూసి విధికి కన్నుకుట్టిందో ఏమో ఒక్కసారిగా రోడ్డు ప్రమాదం రూపంలో పంజా విసిరింది. ఫలితంగా వాహనాలు అదుపుతప్పి ఒకదాని హ్యాండిల్‌కు మరొకటి తగిలి ప్రమాదం జరిగింది. ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. బలమైన గాయాలు కావడంతో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందారు. ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం అర్ధరాత్రి మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారిపై జరిగింది. తాడేపల్లి ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండకు చెందిన గుమ్మలంపాటి రాంబాబు ఏకైక కుమారుడు గుమ్మలంపాటి ప్రభుదేవా (24), ఆత్మకూరుకు చెందిన మేరుగ పద్మ, మేరుగ బుల్లిబాబుల కుమారుడు మేరుగ గోపి (32) పెయింటింగ్ పనులు చేస్తుంటారు. ఈ మధ్యకాలంలో మేరుగ గోపి తల్లి దండ్రుల మధ్య గొడవ రావడంతో తల్లి పద్మ గుండిమెడలో నివాసముంటోంది. గోపికి ఐదు నెలల క్రితం పెళ్లయింది. కొత్త సంవత్సరం సందర్భంగా భార్య జ్యోతి బిర్యానీ చేయడంతో దానిని తల్లికి ఇచ్చేందుకు గోపి గుండిమెడ వెళ్లాడు. అక్కడి నుంచి కొలనుకొండ వచ్చి తనతో పాటు పెయింటింగ్ పనులు చేసే ప్రభుదేవాను, రాకేష్‌ను కలిశాడు. ముగ్గురూ కలిసి అర్ధరాత్రి వరకు పార్టీ చేసుకున్నారు. ఇంటి దగ్గర నుంచి భార్య జ్యోతి ఫోన్ చేయడంతో 5 నిమిషాల్లో వస్తున్నానని చెప్పాడు. అదే సమయంలో ప్రభుదేవా తల్లి కూడా ఫోన్ చేయగా 'వచ్చేస్తున్నానమ్మా. నూతన సంవత్సరం కదా స్నేహితులతో పార్టీ చేసుకుంటున్నాను' అని చెప్పాడు. ఇద్దరు స్నేహితులు కలిసి ఒక ద్విచక్రవాహనంపై మరో స్నేహితుడు మరో ద్విచక్రవాహనంపై బయలుదేరారు. కొలనుకొండ అండర్‌పాస్ వద్దకు రాగానే రెండు బైక్‌లు అదుపు తప్పి హ్యాండిల్స్ తగలడంతో ముగ్గురూ కిందపడ్డారు. మేరుగ గోపి అక్కడికక్కడే మృతి చెందగా ప్రభుదేవా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాకేష్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో 5 నిమిషాల్లో ఇంటికి వస్తానన్న వారు మృతి చెందడంతో వారి బంధువులు శోక సముద్రంలో మునిగిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.



పల్నాడు జిల్లా నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో పెరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని - నాదెండ్ల

రంగేళీకి రంగం సిద్ధం

నేటి నుంచి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు

- ఈ నెల 3వ తేదీ నుంచి 6 వరకు గ్రామ, వార్డుస్థాయిలో పోటీలు
- 7 నుంచి 10 వరకు మండల, మున్సిపల్ స్థాయిలో..
- 12న నియోజకవర్గస్థాయి పోటీలు
- విజేతలకు రూ.5.40 లక్షలు నగదు బహుమతులు



సత్తెనపల్లిలో ముగ్గుల పోటీల నిర్వహణకు చదును చేసిన స్థలం

సత్తెనపల్లి: కనుమరుగైపోతున్న సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకు.. మహిళల్లో దాగి ఉన్న కళాత్మకతను వెలికి తీసేందుకు ఏటా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గస్థాయి వైయస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలను మూడంచెల్లో నిర్వహించడం జరుగుతుంది. ఎంతో వ్యయ ప్రయాసలు అయినప్పటికీ గత నాలుగేళ్లుగా సత్తెనపల్లి శాసనసభ్యుడు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాలు కొనసాగిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మహిళలు ఏటేటా ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. 2018-19లో 2,980 మంది, 2019-20 లో 5,200 మంది, 2020-21 లో 7,300 మంది, 2021-22లో 7,498 మంది మహిళలు పోటీల్లో భాగస్వాములయ్యారు. ఏటా రెట్టింపు ఉత్సాహంతో మహిళలు పాల్గొనడంతో అదే స్థాయిలో వారిని ప్రోత్సహించేందుకు నగదు బహుమతులను అందిస్తున్నారు. విజేతలకే కాక ముగ్గుల పోటీల్లో భాగస్వాములైన ప్రతి మహిళకు ఒక ప్రత్యేక బహుమతిని అందించి తన ఉదారతను చాటుకుంటున్నారు మంత్రి అంబటి.

మూడంచెల్లో పోటీలు...

ఈ పోటీలను మూడంచెలుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 3 నుంచి 6 వరకు గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లోని విజేతలకు ఈ నెల 7 నుంచి 10 వరకు మండలాలు, మున్సిపాలిటీ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. వీటిల్లోని విజేతలకు ఈ నెల 12న నియోజకవర్గ స్థాయిలో సత్తెనపల్లిలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో విజయం సాధించిన మహిళలకు నగదు బహుమతులను అందిస్తారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.2 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.50 వేలు, చతుర్థ స్థానానికి రూ.25 వేలు నగదు బహుమతులను ఇవ్వనున్నారు. అలాగే మండల, మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయి లోనూ వరుసగా నాలుగు బహుమతులు నగదు రూపంలో, ఐదవ బహుమతి కన్సోలేషన్‌గా అందివ్వనున్నారు.

సంక్రాంతి సంబరాలను ప్రోత్సహించేలా...

సంక్రాంతి పర్వదిన ప్రాముఖ్యతను భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకు ఏటా ఈ సంబరాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా వివిధ రకాల పిండి వంటలు అక్కడికక్కడే తయారు చేయించి హాజరయ్యే వారికి అందిస్తున్నారు. అంతేకాక ఎక్కువ మంది ఉత్సాహంగా పాల్గొనేందుకు ఆటవిడుపుగా లక్కీ డీప్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు.

చంద్రబాబు ప్రచార పిచ్చికి బలైన అమాయక ప్రజలు

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార దాహం, ప్రచార పిచ్చికి అమాయక ప్రజలు బలయ్యారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆరోపించారు. ఆదివారం గుంటూరులోని వికాస్ కాలేజీ గ్రౌండ్స్‌లో జనతా వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఆమె సోమవారం జెడ్పీ కార్యాలయంలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఒక ప్రైవేటు వ్యక్తి ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమానికి వచ్చిన చంద్రబాబు దానిని రాజకీయ సభగా మార్చివేశారని విమర్శించారు. కార్యక్రమం మొత్తాన్ని పచ్చ జెండాలతో కప్పివేసి టీడీపీ రాజకీయ సభ మాదిరిగా మార్చి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది ప్రజల అభిమానాన్ని చూరగొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. నూతన సంవత్సరం రోజున చీరలు, సరుకులు ఇస్తామని ఆశ చూపి పేద ప్రజలను తీసుకువెళ్లి వారి ప్రాణాలను తీయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. చంద్రబాబు సభలకు అనుమతులు ఇవ్వరాదని పోలీసు యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదులపై సత్వర 'స్పందన' అవసరం

- అదనపు అడ్మిన్ ఎస్పీ బిందుమాధవ్
- స్పందనలో 56 ఫిర్యాదుల స్వీకరణ



బాధితుల సమస్యలు వింటున్న అదనపు అడ్మిన్ ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందుమాధవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 56 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సి.విజయభాస్కర్‌రావు, దిశా డీఎస్పీ యు.రవిచంద్ర, ఎస్పీ, ఎస్టీ సెల్ డీఎస్పీ షఫ్రుద్దీన్, సీఐ సుభాషిణి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. కొన్ని ఫిర్యాదులు ఇవీ..

■ ఎఫ్ఐఆర్ నమోదుచేసినా చర్యలు లేవు..

నా వద్ద రూ.9లక్షలు తీసుకొని రెండు పాత కార్లు అప్పజెప్పి కొంతకాలం తర్వాత రిజిస్ట్రేషన్ చేయిస్తానంటూ మళ్లీ ఆ కార్లు తీసుకొని వెళ్లి కన్పించకుండా తిరుగుతున్న అశోక్ అనే వ్యక్తిపై 20 నెలల క్రితం నరసరావుపేట వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాను. ఎఫ్ఐఆర్ నమోదుచేసిన పోలీసులు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కేసు గురించి నాకు ఎటువంటి సమాచారం లేదు. అందువలన ఎఫ్ఐఆర్‌ను మరో పోలీసుస్టేషన్‌కు మార్పించి, చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వండి.

– వై.శ్రీనివాసరెడ్డి, న్యాయవాది, నరసరావుపేట

■ ఫోన్‌పేలో డబ్బులు తిరిగి వేస్తామంటూ మోసం..

గత నెల 19న కె.వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి కొంత నగదు ఫోన్‌పే చేశాను. వారంరోజులు గడిచినా ఆ డబ్బులు అతనికి చేరలేదు. బ్యాంకుకు వెళ్లి అడగ్గా మాకు సంబంధం లేదు, మీరు ఫోన్‌పే కస్టమర్‌కేర్‌కు ఫోన్‌చేసి అడగమని చెప్పారు. కస్టమర్‌కేర్‌కు ఫోన్ చేయగా, 77355 12592 అనే నంబరు నుంచి నాకు ఫోన్‌చేసి రూ.6వేలు ఈ నంబరుకు ఫోన్‌పే చేస్తే మొత్తం కలిపి తిరిగి పంపిస్తామని చెప్పారు. నేను నా బ్యాంకు ఖాతా నుంచి నగదు పంపించగా ఇప్పటివరకు తిరిగి నాకు డబ్బులు రాలేదు. నేను మోసపోయానని భావిస్తున్నాను. దీనిపై దర్యాప్తు చేసి నా డబ్బులు నాకు ఇప్పించగలరు.

– కుంచాల వెంకటేశ్వర్లు, రైతు, నరసరావుపేట మండలం

జేఎన్‌టీయూ-ఎన్‌ను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దుతాం



విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శోభన్‌బాబు

నరసరావుపేట ఈస్ట్: జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాలను రాష్ట్రంలోనే మోడల్ ఇంజినీరింగ్ కళాశాలగా తీర్చిదిద్దుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. పల్నాడురోడ్డులోని కళాశాల క్యాంపస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కళాశాల వార్షిక అజెండా మీడియా సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబుతో కలసి విలేకరులతో మాట్లాడారు. వినుకొండరోడ్డులోని కాకాని వద్ద నూతనంగా నిర్మితమవుతున్న కళాశాలను అత్యుత్తమ ఆధునిక సదుపాయాలతో రూపొందిస్తున్నట్టు తెలిపారు. కళాశాల భవన సముదాయం డిజైన్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా పరిశీలించి ఖరారు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. శాశ్వత భవనాలలో 2022-23 విద్యాసంవత్సరం జూన్ నాటికి పూర్తి స్థాయిలో కళాశాల తరగతులను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే మొదటి సంవత్సరం తరగతులను నూతన భవనాలలో ప్రారంభించామని తెలిపారు. కళాశాలకు 80 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితోపాటు మరో 21 అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కాంట్రాక్ట్ పోస్టులకు అనుమతి లభించిందన్నారు. ఆయా పోస్టులను ప్రభుత్వం త్వరలోనే భర్తీ చేస్తుందని వివరించారు. వీటితోపాటు ప్రతి డిపార్ట్‌మెంట్‌కు అదనంగా ఒక టెక్నికల్ పోస్టు మంజూరైనట్టు తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో నూతన కళాశాలను అత్యుత్తమంగా రూపొందిస్తామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



ముక్కోటి ఏకాదశి సందర్భంగా బాల చాముండికా సమేత అమరేశ్వరుడి గ్రామోత్సవం (ఇన్‌సెట్) గరుడవాహనంపై వేంకటేశ్వరుడు

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాల చాముండికా సమేత అమరేశ్వరుని దేవాలయంలో భక్తులు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం వేకువజామున ఆలయంలోని ఉత్తరద్వారం వద్ద భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను రాజవీధికి అభిముఖంగా ఉన్న గాలిగోపురంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. తరువాత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే గ్రామంలోని కోదండ రామాలయం, పాండురంగస్వామి దేవాలయాలలో ఉదయాన్నే స్వామివారిని ఉత్తరద్వారంలో దర్శనం చేసుకుని భక్తులు పూజలు నిర్వహించారు. కోదండ రామాలయం అర్చకుడు పరాశరం రామకృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఈరోజునే ముప్పది మూడు కోట్ల దేవతలు స్వామిని పూజించారని అందుకే ముక్కోటి ఏకాదశి అన్నారన్నారు.

వైకుంఠపురంలో...

మండల పరిధిలోని వైకుంఠపురంలో సోమవారం వేకువ జామున స్వామివారిని ఉత్తర గాలిగోపురంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మేళతాళాలతో ఉభయ దేవేరులతో కూడిన వేంకటేశ్వరుని పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. అలాగే మల్లాది అభయాంజనేయస్వామి ఆలయంలో కోదండ రామస్వామి ఉత్సవమూర్తులను ఉత్తరద్వారం వద్ద ఉంచి భక్తులకు ఉత్తర ద్వారదర్శనం కల్పించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్తర ద్వారదర్శనం చేసుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.


ఇంటి వద్దకే పీడీఎస్ బియ్యం, నిత్యావసరాలు

నరసరావుపేట: జనవరి మాసానికి సంబంధించి పీడీఎస్ రేషన్ బియ్యాన్ని ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకే ఇంటి వద్దకే వచ్చి అందజేస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు సోమవారం వెల్లడించారు. సార్టెక్స్ బియ్యం తెలుపు రంగు రేషన్‌కార్డు దారులకు ఒక్కొక్కరికి 5కేజీల చొప్పున, ఏఏవై కార్డు దారులకు కార్డు ఒక్కింటికి 35కేజీల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కందిపప్పు తెల్లరంగు రేషన్‌కార్డుదారులు, ఏఏవై కార్డు దారులకు ఒక్కింటికి ఒక కేజీ చొప్పున, పంచదార తెలుపురంగు కార్డుదారులకు అరకేజీ, ఏఏవై కార్డు దారులకు ఒక కేజీ చొప్పున పంపిణీ చేస్తామన్నారు. కార్డుదారులు ఏవరైనా వారి బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తే కార్డు రద్దుచేయబడటంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవటం జరుగుతుందని, కొనుగోలు చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

వివాహిత ఆత్మహత్య

పెదకూరపాడు: వేధింపులు తాళలేక ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెదకూరపాడు లింగంగుంట్లలో చోటుచేసుకుంది. పెదకూరపాడు ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లు మండలం చేజర్ల గ్రామానికి చెందిన షేక్ ఫాతిమా(20)కు పెదకూరపాడుకు చెందిన అనస్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఏడు నెలల పాప ఉంది. గత కొంత కాలం నుంచి మృతురాలు ఫాతిమాను భర్త అనస్, అత్త జైనాబీలు వేధిస్తున్నట్లు మృతురాలి తల్లి షేక్ సైదాబీ ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంటిలో ఎవరు లేనిసమయంలో ఇంటిలోని ఫ్యానుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. సంఘట స్థలాన్ని సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామిలు పరిశీలించారు. అనంతరం అమరావతి సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్



అమరావతి: భారతీయ జనతా పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా అమరావతి మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన అలోకం సుధాకర్ నియమితులయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అలోకం సుధాకర్‌ను పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడినట్లు సుధాకర్ తెలిపారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో గ్రామ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.